# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

గురువారం 28 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm


## జ్యోతిరావు పూలేకు సీఎం నివాళి

హైదరాబాద్ : మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన వారిలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి , ఇతర నేతలు ఉన్నారు.



## సర్వేలో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ వివరాలు నమోదు



హైదరాబాద్ : యావత్ దేశానికి మార్గాన్ని నిర్దేశిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరాలు నమోదు చేయించుకున్నారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి , ఇతర అధికారులు, ఎన్యుమరేటర్లు, సిబ్బందితో కూడిన సర్వే బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు. సర్వే పురోగతి వివరాలను, సర్వేలో పాల్గొన్న ప్రజల స్పందన గురించి అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు.

# హాస్టల్స్‌లో తనిఖీలు చేయాలి



నివేదికలు సమర్పించాల్సిందే

పౌష్టికాహార విషయమై నిర్లక్ష్యం వద్దు

కొందరు దురుద్దేశంతో అప్రతిష్టపాలు చేసేందుకు కుట్ర

సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించే విషయంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇయ్యరాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు

. బడి పిల్లలకు అందించే ఆహారానికి సంబంధించి ఘటనలు పునరావృతం కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలను తనిఖీ చేసి, నివేదికలను సమర్పించాల్సిందే అని ఆదేశించారు. గడిచిన పదేండ్లలో గాడితప్పిన విద్యా వ్యవస్థను తిరిగి దారిలో పెట్టే క్రమంలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. విద్యార్థినీ విద్యార్థుల విషయంలో సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు దురుద్దేశంతో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, లేనివి ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## ముగిసిన కాళేశ్వరం

# బహిరంగం విచారణ



90 మంది ఇంజినీర్ల నుంచి కీలక సమాచారం సేకరణ

నెక్ట్స్ ఐఏఎస్ లు వంతు..

హైదరాబాద్ : కాళేశ్వరం బహిరంగ విచారణ ముగిసింది. రెండు నెలల్లో 90 మంది ఇంజినీర్లను విచారించి కీలక వివరాలు తెలుసుకుంది. అయితే అఫిడవిట్ లో ఉన్న అంశాలు ఒకటైతే విచారణలో వేరే సమాధానాలు చెప్పడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ నుంచి మొదలు పెడితే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్, చీఫ్ ఇంజనీరింగ్ వరకు అందరినీ ప్రశ్నించారు. ఒక్కొక్కరినీ పిలిచి జస్టిస్ చంద్రఘోష్ వివరాలు సేకరించారు. ఫీల్డ్ లెవల్ లో పనిచేసిన అధికారులు కాబట్టి రోజువారీ పనిని అడిగి తెలుసుకోవడమే కాకుండా బెస్ మెంట్ రిజిస్టర్ లను స్వాధీనం చేసుకున్నారు. రిజిస్టర్లలో నమోదు చేసినటువంటి అంశాలపై ఆరా తీశారు. రెండు నెలల్లో 90 మంది స్టేట్ మెంట్లను రికార్డు నమోదు చేశారు. మరోవైపు ఇంజనీర్ల బహిరంగ విచారణలో కీలక వ్యాఖ్యలు చేశారు. చాలామంది కమిషన్ వేసే ప్రశ్నలకు దాటవేసే సమాధానాలు చెప్పారని, నిజాలు దాచిన తాము బయటికి తీస్తామన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అఫిడవిట్ లో చెప్పిన చేర్చిన అంశాలు ఏ మాత్రం ఫీల్డ్ లో కనిపించడం లేదన్నారు. ఇంజనీర్లు డెడికేషన్ తో పనిచేస్తే బ్లాకులు ఎందుకు కొట్టుకుపోయాయని ప్రశ్నించారు. ఇంజనీర్ల విచారణ ముగియగా.. ఐఏఎస్ విచారణ మొదలు కానున్నట్లుగా తెలుస్తోంది. వచ్చే సోమవారం నుంచి ఐఏఎస్ లను పిలవనున్నట్లు సమాచారం.

# అమోయ్ కుమార్ పై కేసు నమోదుకు సిఫారసు

ఎమ్మార్వో, ఆర్డీఓపై కూడా

భూ లావాదేవీల్లో అక్రమాలు గుర్తింపు



రంగారెడ్డి : భూదాన్ ల్యాండ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ డీజీపీకి ఈడీ అధికారులు నివేదిక ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్ పై కేసు నమోదుకు సిఫారుసు చేశారు. ఆయన తోపాటు ఎమ్మారో జ్యోతి, ఆర్డీఓ వెంకటాచారిపై కేసు నమోదు చేయాలని రిపోర్టు చేశారు. భూ బదలాయింపు లావాదేవీల్లో అనేక అక్రమాలు ఉన్నట్లు గుర్తించారు. అక్రమాలు జరిగినా గతంలో పోలీసులు కేసులు నమోదు చేయలేదని నివేదించారు.

# ప్రధాని మోదీని బెదిరిస్తూ ఫోన్ కాల్



ముంబయి: ఈసారి ప్రధాని మోదీపై బెదిరింపులకు పాల్పడటంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ముంబయి ట్రాఫిక్ పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు గురువారం ఉదయం ఓ బెదిరింపు కాల్ వచ్చింది. అందులో ప్రధాని నరేంద్ర మోదీ ని హత్య చేసేందుకు ప్లాన్ చేసినట్లు ఓ మహిళ బెదిరించారు. అందుకు ఓ ఆయుధాన్ని సైతం సిద్ధం చేసుకున్నట్లు చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితురాలి నుంచి వచ్చిన ఫోన్ కాల్‌ను ట్రేస్ చేస్తున్నారు. సదరు మహిళ మానసిక అనారోగ్యంతో బాధపడుతుండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఇటీవల బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌ను బెదిరిస్తూ ముంబయి ట్రాఫిక్ పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు వరుసగా బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే.

# అదానీ వ్యవహారంపై చర్చకు పట్టు


కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్ష సభ్యులు నినాదాలు

లోక్ సభ, రాజ్యసభ రేపటికి వాయిదా

న్యూఢిల్లీ : పార్లమెంటులో నాల్గోరోజు కూడా వాయిదాలపర్వం కొనసాగింది. ఆరంభంలోనే ఉభయసభలు రేపటికి వాయిదాపడ్డాయి. ఉదయం 11గంటలకు లోక్ సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా... ఉప ఎన్నికల్లో గెలుపొందిన ప్రియాంకాగాంధీ, రవీంద్ర వసంతరావు చవాన్ లతో ప్రమాణం చేయించారు. అనంతరం విపక్ష సభ్యులు తమ స్థానాల నుంచి లేచి... అదానీ లంచాల వ్యవహారంతోపాటు ఇతర అంశాలపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. మరికొందరు ఎంపీలు వెల్ లోకి దూసుకెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ సభ కార్యక్రమాలకు అంతరాయం కలగటంతో...స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం 12గంటల వరకు వాయిదావేశారు. ఆ తర్వాత మళ్లీ సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవటంతో లోక్ సభను రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఉదయం సమావేశం కాగానే ఛైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ ...వివిధ అంశాలపై విపక్ష సభ్యులు ఇచ్చిన వాయిదాతీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అదానీ లంచాల వ్యవహారంతోపాటు ఇతర అంశాలపై చర్చ జరపాలని నినాదాలు చేశారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ తొలుత 12 గంటల వరకు సభను వాయిదా వేశారు. ఆ తర్వాత తిరిగి సమావేశమైనా...పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోవటంతో రాజ్యసభను రేపటికి వాయిదావేశారు



# విభజన సమస్యలపై దృష్టి




### త్వరలో తెలంగాణ, ఏపీ సీఎస్ ల సమావేశం

హైదరాబాద్ : పెండింగ్ లో ఉన్న విభజన సమస్యలపై దృష్టి పెట్టాయి తెలుగు రాష్ట్రాలు. ఏపీ, తెలంగాణ సీఎస్ ల సమావేశం త్వరలో జరగనుంది. ఇందులో పెండింగ్ అంశాలపై దృష్టి పెట్టనున్నారు. ఆఫీసర్ల కమిటీలో రెండు రాష్ట్రాల సీఎస్ లతోపాటు ముగ్గురు చొప్పున ఏపీ, తెలంగాణకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. ప్రస్తుత సీఎస్ ల సమావేశంలో పరిష్కారం కానీ సమస్యలను మంత్రుల కమిటీ ముందు ఉంచుతారు. మంత్రుల స్థాయిలోను ఏకాభిప్రాయం కుదరిన పక్షంలో రెండు రాష్ట్రాల సీఎంలు చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. రెండు రాష్ట్రాల్లో విద్యా సంస్థల ఏర్పాటు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అంశాలు తెలంగాణలో స్టీల్ ఫ్యాక్టరీ , కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, ఏపీ లోని కడపలో స్టీల్ ప్లాంట్ నేషనల్ హైవేలపై తేలాల్సి ఉంది. ఉద్యోగుల సమస్య కూడా పరిష్కరించాల్సి ఉంది. ఏపీ విభజన చట్టం 9.10 షెడ్యూళ్లలోని సంస్థల అంశాల్లోని ఆర్టీసీ, ఎస్ఎంసీ అంశాలు పరిష్కారం కావాల్సి ఉంది. షీలాబిడే కమిటీ సిఫారసుల మేరకు మొత్తం 91 కార్పొరేషన్లు ఉండగా, ఆర్టీసీ, ఎస్ఎఫ్సీ వంటి 23 కార్పొరేషన్లపై ఇరు రాష్ట్రాల మధ్య భిన్న వాదనలున్నాయి. 10వ వ షెడ్యూల్ లో మాత్రం 142 సంస్థలున్నాయి. సుమారుగా 30 సంస్థలపై విభిన్నాభిప్రాయాలున్నాయి. జూలై 6న తెలుగు రాష్ట్రాల భేటీ జరిగింది. విభజన సమస్యలపై చర్చించారు. ఈ పదేళ్లలో రెండు రాష్ట్రాల అధికారులతో ఏర్పాటైన కమిటీ 30 వరకు సమావేశాలు నిర్వహించగా.. ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన వంటి వ్యవహారాలపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరగా మిగతావన్నీ పెండింగ్ లో ఉన్నాయి.